## క్లుప్తంగా

### 20న ఐటీఐలో అప్రంటీస్ మేళా

**తంబళ్లపల్లె:** స్థానిక టీఎన్ వెంకట సుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 20న అప్రంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ శేషారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లాలో ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు మేళాలో పాల్గొనవచ్చున్నారు. శ్రీసిటీ, శ్రీకాళహస్తిలోని పలు కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అప్రంటీస్ విధానంలో ఉపాధి కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

### దినసరి మార్కెట్ వేలం

**రామసముద్రం:** రామసముద్రం సచివాలయంలో ఈవోఆర్డీ చలపతిరావు ఆధ్వర్యంలో శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. దినసరి మార్కెట్, వారపుసంత, బస్టాండ్ గేటు, వేలం నిర్వహింగా పంచాయతీకి రూ.5.70 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈవోఆర్డీ తెలిపారు. దినసరి మార్కెట్ , వారపుసంత రూ.3.65 లక్షలకు కలందర్‌బాషా కైవసం చేసుకున్నారు. అలాగే బస్టాండ్‌ను వేలంపాట నిర్వహించగా రామ్మూర్తి రూ.2.05 లక్షలకు కైవసం చేసుకున్నారని తెలిపారు. వేలంలో పంచాయతీ కార్యదర్శి విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ షాక్‌తో ఆరు గొర్రెలు మృతి



**పెద్దమండ్యం:** పెద్దమండ్యం పంచాయతీ రెడ్డివారిపల్లె హరిజనవాడకు సమీపంలో విద్యుత్ షాక్‌తో 6 గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన రామాంజులు గొర్రెలు మేపుకొని జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం గొర్రెల మేత కోసం హరిజనవాడకు సమీపంలోని బీడు పొలాలవైపు గొర్రెలను తోలుకొని వెళ్లాడు. అయితే గురువారం రాత్రి ఈదురుగాలులకు అవిషిచెట్టు పడడంతో విద్యుత్ తీగ తెగిపోయి నేలపై పడిపోయింది. విద్యుత్ తీగను గొర్రెలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. చెట్టును తొలగించి విద్యుత్ తీగలను అధికారులు పునరుద్ధరించారు. గొర్రెలు కోల్పోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

### యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**పీలేరు :** నిత్యం యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా థెరపిస్ట్ పి.వి.ఎస్. లక్ష్మీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5 నుంచి 25 వరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక వీఎస్ఎన్ సిద్ధార్థ విద్యా సంస్థలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు యోగా పట్ల మక్కువ చూపి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

### ఐక్యపోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యం

**తంబళ్లపల్లె:** మాదిగలు ఐక్యంగా పోరాటం చేస్తేనే ఎస్సీ వర్గీకరణ సాధ్యపడుతుందని మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు దుమ్ము చిన్న తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో సమీక్ష సమావేశం జరిగింది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎస్సీ వర్గీకరణకై రెండవ సంగ్రామ పాదయాత్ర పెద్దమండ్యం మండలం వెలుగల్లు నుంచి ప్రారంభించడం జరుగుతుందన్నారు. మాదిగలందరూ పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు వెంకటప్ప, మల్లికార్జున, జయమ్మ, బొజ్జప్ప, శంకర తదితరులు పాల్గొన్నారు.

# పీడీఎఫ్‌కు ఎదురుదెబ్బ

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘోర పరాజయం
- మట్టికరిపించిన వైఎస్సార్‌సీపీ
- వామపక్ష విధానాలకు తిలోదకాలొదిలిన సీపీఎం, సీపీఐ
- టీడీపీతో చేతులుకలిపినా వరించని విజయం
- ప్రతి రౌండ్‌లోనూ వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థికి ఆధిక్యం

ఒకప్పుడు సమసమాజం.. పేదరిక నిర్మూలన, సమాన పనికి సమాన వేతనం.. అంటూ విప్లవ భావాలను పుణికిపుచ్చుకుని ఉద్యమకెరటాలతో కదం తొక్కే వామపక్షాలు ఇప్పుడు దిగజారిపోయాయి. ఏ ఎండకాగొడుగు పడుతూ సిద్ధాంతాలను తుంగలోతొక్కి అడ్డదారులు వెతుకుతున్నాయి. ఇందులో భాగంగానే ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీతో లోపాయికారి ఒప్పందం కుదురుకుని వైఎస్సార్‌సీపీని దెబ్బకొట్టాలని భావించాయి. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగకుండా అడగడుగునా అడ్డుతగిలాయి. కానీ వారి వ్యూహాలు, కుట్రలు, కుతంత్రాలు పటాపంచెలయ్యాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విజయకేతనం ఎగురవేశారు. పీడీఎఫ్ విజయపరంపరాలకు అడ్డుకట్ట వేశారు.

**సాక్షి, తిరుపతి :** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల చరిత్రలో ఓటమి ఎరుగని పీడీఎఫ్‌కు వైఎస్సార్‌సీపీ గట్టి షాక్ ఇచ్చింది. మొదటి సారిగా పీడీఎఫ్‌కు ఓటమిని రుచిచూపించింది. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఘన విజయం సాధించారు. ఉమ్మడి ప్రకాశం- నెల్లూరు- చిత్తూరు జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఇటీవల ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి ప్రజల్లో ఉన్న మద్దతును దృష్టిలో ఉంచుకుని ఓటమి తప్పదని భావించింది.

వామపక్ష భావాలకు విరుద్ధంగా సీపీఎం, సీపీఐ నాయకులు టీడీపీతో పొత్తుపెట్టుకుని నానా తంటాలు పడ్డారు. టీడీపీ పొత్తుతో పీడీఎఫ్ అభ్యర్థికి ఎన్నోకొన్ని ఓట్లు వస్తాయని భావించాయి. అందులో భాగంగా టీడీపీతో కలిసి ఎన్నికలకు ముందు నుంచి నానారభస చేశారు. నిజమైన ఓటర్లను సైతం దొంగ ఓటర్లుగా చిత్రీకరించి భయభ్రాంతులకు గురిచేశారు. ఓటింగ్ శాతాన్ని తగ్గించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు.



రిటర్నింగ్ అధికారి హరినారాయణన్ నుంచి డిక్లరేషన్ పత్రం అందుకుంటున్న పర్వతరెడ్డి

**విజయ'శేఖరుడు'**

చిత్తూరు ఎస్వీ సెట్‌లో గురువారం నిర్వహించిన కౌంటింగ్‌లో పీడీఎఫ్ అభ్యర్థి ఏ ఒక్క రౌండ్‌లోనూ మెజారిటీ సాధించలేకపోయారు. మొదటి రౌండ్ నుంచి రెండో ప్రాధాన్యత ఓటు లెక్కింపు వరకు వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి ఆధిక్యం కనబరుస్తూ వచ్చారు. శుక్రవారం వేకువజాము వరకు ఉత్కంఠంగా సాగిన కౌంటింగ్‌లో పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి విజయఢంకా మోగించారు. ఎన్నికలు ఏవైనా... ప్రతి పక్షంలో ఎవరున్నా... వైఎస్సార్‌సీపీకే తమ మద్దతు అని ఉపాధ్యాయ ఓటర్లు మరోసారి రుజువుచేశారు.

**పీడీఎఫ్‌కు మొదటి సారి ఓటమి**

పీడీఎఫ్‌కు మొదటి సారి ఓటమి ఎదురైంది. 1985లో అప్పటి సీఎం ఎన్టీ రామారావు శాసనమండలి వ్యవస్థను రద్దు చేశారు. ఆ తర్వాత 2007లో దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి తిరిగి శాసనమండలి వ్యవస్థను పునరుద్ధరించారు. అప్పటి నుంచి మూడు సార్లు మండలి ఎన్నికలు నిర్వహించారు. 2007లో పీడీఎఫ్ అభ్యర్థి దాచూరి రామిరెడ్డి టీచర్ ఎమ్మెల్సీగా గెలుపొందారు. 2011–2017, 2017–2023 వరకు పీడీఎఫ్ అభ్యర్థి విఠపు బాలసుబ్రహ్మణ్యం టీచర్ ఎమ్మెల్సీగా గెలుపొందారు. గత 16 ఏళ్లుగా టీచర్ ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకుంటున్న పీడీఎఫ్‌కు మొదటి సారి ఎదురుదెబ్బ తగిలింది.

# అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

**పీలేరు రూరల్ :** స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని ఏపీ టూరిజం స్థలంలో అక్రమ నిర్మాణాలను తహసీల్దార్ రవి నిలిపివేశారు. శుక్రవారం ఏపీ టూరిజంకు కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని రాయచోటి ఆర్డీవో రంగస్వామి ఆదేశాల మేరకు తహసీల్దార్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థలాన్ని పరిశీలించి నిర్మాణాలు నిలిపివేయాలని ఆదేశించారు. ఏపీ టూరిజానికి కేటాయించిన స్థలంలో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ స్థలంలో వేసిన బోరును కూడా సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ స్థలాలను ఎవరూ ఆక్రమించిని ఎంతటివారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం జిల్లా కౌన్సిలర్ మెంబర్ ఎస్. షాకీర్, వీఆర్వోలు యోగానంద, హేమంత్‌నాయక్ పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవి

# అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో ప్రతిభ

**మదనపల్లె :** బంగ్లాదేశ్‌లో జరిగిన అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో పట్టణంలోని శ్రీ శ్రీనివాస డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఎలక్ట్రానిక్స్ రెండో సంవత్సరం చదువుతున్న జే.గణేష్‌రాజు గురువారం నేపాల్‌తో జరిగిన ఇంటర్నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనపరిచారు. త్రోబాల్ చాంపియన్ షిప్ విభాగంలో విజయం సాధించి మూడోస్థానంలో నిలిచిన భారతజట్టులో కీలకపాత్ర పోషించాడు. గణేష్‌రాజు గతంలో రాష్ట్రస్థాయిలో వెస్ట్ గోదావరి, అనంతపురం, విజయవాడ, వైజాగ్‌లలో జరిగిన త్రోబాల్ పోటీల్లో విజేతగా పలు బహుమతులు, ప్రశంసలు పొందాడు. జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, తమిళనాడులో జరిగిన పోటీల్లో పాల్గొన్నాడు. వీటన్నింటిలో మంచి ఆటతనాన్ని కనపరుస్తూ బంగ్లాదేశ్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీలకు ఎంపికై విజేతగా నిలిచి మదనపల్లె కీర్తిని చాటిచెప్పినట్లు శ్రీనివాస డిగ్రీ కళాశాల డైరెక్టర్ ఎన్.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తమ కళాశాల విద్యార్థిని అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడంపై కరస్పాండెంట్ శ్రీనివాసులురెడ్డి, ప్రిన్సిపాల్ బి.వి.రమణాచారి, అధ్యాపక బృందం గణేష్‌రాజుకు అభినందనలు తెలిపారు.



అంతర్జాతీయ త్రోబాల్ క్రీడాకారుడు గణేష్‌రాజు

# రూ.19 కోట్ల పన్ను వసూళ్లు లక్ష్యం

- ఇప్పటి వరకు 70 శాతం వసూలు
- జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి

**కురబలకోట :** అన్నమయ్య జిల్లాలో పంచాయతీల ద్వారా రూ. 19 కోట్లు పన్నులు వసూలు చేయాలన్నది లక్ష్యమని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె తెట్టు పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. డంపింగ్ యార్డును పరిశీలించారు. అదే రోజు అంగళ్లలో జరిగిన వివిధ సంతల గేటు వేలం పాటల బహిరంగ సభలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈనెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న దృష్ట్యా పంచాయతీలలో పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 70 శాతం వసూలు చేయడం జరిగిందన్నారు. వంద శాతం లక్ష్యం కోసం అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. పన్నుల వసూళ్లను మరింత వేగవంతం చేయాలని అధికార యంత్రాంగాన్ని నిర్దేశించారు. జిల్లాలో రెండు సర్పంచ్, 48 వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉందన్నారు. ఇందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పోలింగ్ స్టేషన్లు, ఓటరు లిస్టులను సంసిద్ధం చేశామన్నారు. ఎన్నికల కమీషన్ ఆదేశాలు వెలువడిన వెంటనే ఈ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామన్నారు. అంతకు ముందు ఆమె తెట్టులోని అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలను, బాలింతలు, గర్భిణీలతో మాట్లాడారు. పిల్లల హాజరును పరిశీలించారు. పౌష్టిక ఆహారం గురించి విచారించారు. వంటలను మరింత రుచి కరంగా వడ్డించాలని సూచించారు. తల్లులు, పిల్లలు, బాలింతలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. రక్తహీనతను నివారించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగళ్లు, తెట్టు సర్పంచులు పోరెడ్డి విశ్వారెడ్డి, నులక మనోహర్‌రెడ్డి, ఈఓఆర్‌డి సుకూర్, కార్యదర్శి నవాజ్ తదితరులు పాల్గొన్నారు.



తెట్టు పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ ధనలక్ష్మి

# వైభవంగా గంధోత్సవం

**వాల్మీకిపురం:** స్థానిక ప్రాచీన సయ్యద్ ఖాజాపీర్ మస్తాన్‌వలి దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి హజ్రత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరిఫుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుసేని చిష్తివుల్ ఖాదరి సజ్జాద నషీన్ ఆస్తాన-ఎ-మఖ్దూముల్లాహి హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు, చదివింపులు నిర్వహించారు. ఉరుసు ఉత్సవంలో హిందు, ముస్లిం అనే భేదం లేకుండా యువత పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రముఖ కళాకారులచే ఖవాలి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్, హజ్‌కమిటీ డైరెక్టర్ ఖాదర్ బాషా, వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ కరీముల్లా, వైఎస్సార్‌సీపీ కార్యదర్శి ఆఘా మొహియుద్దిన్, మతపెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న కడప పీఠాధిపతి, ముస్లింలు

# క్షయ రోగులకు పౌష్టికాహారం అందజేత

**కలకడ :** క్షయవ్యాధి గ్రసుస్తులను ఆరోగ్య సిబ్బంది దత్తత తీసుకుని నెలవారి వారి ఆరోగ్య పోషణకు, ఉత్తమ చికిత్సకు అయ్యే పూర్తి ఖర్చు భరిస్తామని మాటిచ్చారు. శుక్రవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ పోషనమిత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు క్షయవ్యాధి నివారణకు అందిస్తున్న ఉచిత మందులతో పాటు 8మంది రోగులను ఆరోగ్యసిబ్బంది దత్తతకు తీసుకుని ఒక్కొక్కరికి రూ.వెయ్యి విలువైన పౌష్టిక ఆహార పదార్థాలను అందజేశారు. కేవలం ఆరు నెలల పాటు ఉచిత మందులు, పౌష్టిక ఆహారం వైద్యుల సూచన మేరకు వినియోగిస్తే క్షయవ్యాధి నుంచి పూర్తి విముక్తి పొందవచ్చునని తెలిపారు. డాక్టర్ కిషోర్‌కుమార్ రెడ్డి, డాక్టర్ జవహర్‌బాబు, ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, ఎంహెచ్ఎస్ ముజీబ్‌బాషా, సిబ్బంది రెడ్డెమ్మ, మురళి, నాగిరెడ్డి, భారతి, జమీల్‌అహమ్మద్, వాణి తదితరులు ఉన్నారు.



టీబీ వ్యాధిగ్రస్తులకు ఉచిత పౌష్టిక ఆహారం అందజేస్తున్న వైద్యులు

### దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి

**మదనపల్లె సిటీ:** దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రభుత్వ వైద్యశాఖ దంత వైద్యులు డాక్టర్ అప్సానాబేగం అన్నారు. శుక్రవారం స్థానిక అమ్మ చెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో నేషనల్ ఓరల్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు దంతాలకు సంబంధించి సమస్యలు గురించి వివరించారు. ప్రతి రోజూ రెండు సార్లు దంతాలను శుభ్రం చేసుకోవాలని, రాత్రి పడుకునే ముందు తప్పకుండా బ్రెష్ చేయాలని సూచించారు. అనంతరం దంత పరీక్షలు చేసి టూత్‌పేస్టులు, బ్రష్‌లు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో బి.కొత్తకోట దంత వైద్యులు దుర్గాదేవి, వెలుగు పాఠశాల కన్వీనర్ భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దంతవైద్యురాలు అప్సానాబేగం

### ఘనంగా అక్కదేవతల నగరోత్సవం

**వాల్మీకిపురం:** పట్టణ సమీపంలోని పాలతలకోనలో వెలసిన అక్కదేవతల ఆలయంలో పెద్దపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని చాందినీ బండిపై విశేష అలంకరణలు గావించి, గుర్రాలు, గంపలను మేళతాళాల నడుమ పట్టణ పురవీధుల్లో దేవస్థానం వరకు నగరోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పూజారి రామక్రిష్ణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

**మదనపల్లె సిటీ:** రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ ఎస్. రామలింగారెడ్డి అన్నారు.శుక్రవారం కాలేజీలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్తం అందించడం వల్ల ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. వేసవి దృష్టిలో ఉంచుకుని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. 117 మంది రక్తదానం చేశారు.కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సతీష్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు బాబులాల్, గౌతంరెడ్డి, భాస్కరాచారి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

### రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**కలికిరి:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని గుట్టపాళెం సర్పంచ్ రెడ్డివారి వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం గుట్టపాళెం గ్రామంలో భూరీసర్వేకి సంబంధించి డ్రోన్ సర్వేని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేతో ఇప్పటి వరకు ఎలాంటి భూతగాదాలున్నా పరిష్కరించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. పక్కాగా భూ హద్దులు గుర్తించి, కమతాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకాంత్, కార్యదర్శి గోపి, విఆర్ఓ కదిరప్ప, విలేజ్ సర్వేయర్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



డ్రోన్ సర్వేని ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటరెడ్డి

# ఘనంగా అమ్మవారికి బోనాల సమర్పణ

**వాల్మీకిపురం:** మండలంలోని చింతపర్తి బాహుదానది ఒడ్డున వెలసిన శ్రీ గుంటి గంగమ్మ జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. చాందినీబండ్లు, అన్నదానం బండ్లు, పానకం బండ్లు ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.









# వేలంలో మేజర్ పంచాయతీకి ఆదాయం



గుర్రంకొండ పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు



అంగళ్లులో వేలం నిర్వహిస్తున్న డీపీఓ ధనలక్ష్మి, సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి

**గుర్రంకొండ:** గుర్రంకొండ మేజర్ పంచాయతీలో పలు కాంట్రాక్ట్‌లకు సంబంధించి నిర్వహించిన వేలంలో రూ. 22,18,500 ఆదాయం పంచాయతీకి సమకూరింది. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ డీఎల్‌పీవో నారాయణ ఆధ్వర్యంలో 2023–24 ఏడాదికి సంబంధించి వారపుసంత, బస్టాండు, జంతువధశాల, గంగిరేణిచెట్ల వేలం నిర్వహించారు. వేలంలో వారపుసంతను రూ.15,25,000, ప్రైవేట్ బస్టాండు రూ.6. లక్షలు, జంతువధశాల రూ.85000, గంగిరేణిచెట్టు రూ.8500లకు వేలం పాడుకొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తుల పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వారపుసంతలో మరుగుదొడ్లు లేక ఇటు వ్యాపారులు, అటు మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో నిర్మించిన మరగుదొడ్లను వెంటనే తెరపించి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జమీర్ ఆలీఖాన్, సర్పంచ్ మెహర్‌తాజ్, ఉపసర్పంచ్ కొండేటి సుమలత, పంచాయతీ ఈవో బ్రహ్మనందరెడ్డి, కార్యదర్శి నిస్సార్, సిబ్బంది పాల్గొన్నారు.

**అంగళ్లుకు రూ.72.88 లక్షల ఆదాయం**

**కురబలకోట:** మండలంలోని అంగళ్లు పంచాయతీలోని గొర్రెల సంత, టమాటా మార్కెట్, వారపు సంత మార్కెట్ గేటు వేలం పాటల ద్వారా రూ.72.88 లక్షలు ఆదాయం లభించింది. శుక్రవారం వీటికి స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి ఆధ్వర్యంలో సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి అధ్యక్షతన వేలం నిర్వహించారు. పోటా పోటీగా వేలం సాగింది. గత ఏడాది కన్నా రూ. 32.33 లక్షలు అధికంగా ఆదాయం వచ్చినట్లు సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి,గ్రామ కార్యదర్శి ఎంటీజీ ప్రసాద్ తెలిపారు. ఈసారి గొర్రెల సంత గేటు వేలం పాట రూ.42.35 లక్షలకు పి. ద్వారకనాథరెడ్డి పాడారు. టమాటా మార్కెట్ గేటు వేలం రూ. 25.40 లక్షలు, అంగళ్ల వారపు సంత రూ. 5.13 లక్షలు పలికింది. గత ఏడాది కంటే పంచాయతీకి ఆదాయం పెరిగిందని అధికారులు తెలిపారు.

